సాక్షి
రంగారెడ్డి
సోమవారం ၊ 23 ၊ జూన్ ၊ 2025



రిజర్వేషన్లు కల్పించాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ డిమాండ్‌ చేశారు. 8లో▸



భూముల విక్రయానికి ..

టెక్స్‌టైల్‌ భూములు విక్రయించేందుకు కొందరు డైరెక్టర్లు యత్నిస్తున్నారని సొసైటీ సభ్యులు ఆరోపించారు. 8లో▸



సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్‌టీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్‌

గెస్ట్‌ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం



చేవెళ్లలోని కస్తూర్బాగాంధీ పాఠశాల

చేవెళ్ల: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో బోధించేందుకు గెస్ట్‌ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఇన్‌చార్జి శ్వేతారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల ఈఏడాది నుంచి ఇంటర్‌ మొదటి సంవత్సరానికి అప్‌గ్రేడ్‌ అయిందని తెలిపారు. ఇంటర్‌ విద్యార్థులకు బోధన చేసేందుకు బోటనీ, కెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించిన గెస్ట్‌ ఫ్యాకల్టీ అవసరం ఉందన్నారు. అభ్యర్థులు పీజీ, బీఎడ్‌ అర్హతలు కలిగి ఉండాలని చెప్పారు. ఎంఎల్‌టీ కోర్సు (మెడికల్‌ ల్యాబ్‌ టెక్నీషియన్‌) బోధించేందుకు సైతం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వసతిగృహానికి డే వాచ్‌ఉమెన్‌ పోస్ట్‌ ఖాళీగా ఉందని, పదో తరగతి చదివిన మహిళలు అర్హులని తెలిపారు. ఆయా పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 91004 39368 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో టీటీడీ బోర్డు సభ్యుడు



దేవాలయానికి విచ్చేసిన టీటీడీ బోర్డు సభ్యుడు సదాశివరావు

షాద్‌నగర్‌: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని ఆదివారం టీటీడీ బోర్డు సభ్యుడు సదాశివరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయానికి విచ్చేసిన ఆయనను అర్చకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది మోముల బసప్ప, నాయకులు బస్వం, దండు వాసు, ఒగ్గుకిశోర్‌, జాంగారి రవి, మార్గం రాజేష్‌, రాంభూపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

మరకత శివాలయాన్ని దర్శించుకున్న వెన్నెల



స్వామి వారికి పూజలు చేస్తున్న వెన్నెల

శంకర్‌పల్లి: మండలంలోని చెందిప్ప గ్రామంలో వెలసిన 11వ శతాబ్దపు బ్రహ్మసూత్ర మరకత శివాలయాన్ని ఆదివారం తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌, గద్దర్‌ కుమార్తె గుమ్మడి వెన్నెల దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెకి శేషవస్త్రం కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వెన్నెల మాట్లాడుతూ.. మరకత శివాలయాన్ని సందర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. మళ్లీ సమయం తీసుకొని వస్తానని, ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సదానందం గౌడ్‌, చైర్మన్‌ గోపాల్‌రెడ్డి, సభ్యులు మోహన్‌, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

చీకటి వేంకటేశ్వరస్వామి ఆలయ సందర్శన



ఆలయానికి విచ్చేసిన సంతోష్‌కుమార్‌పాండ్యే

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని చీకటి వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని ఆదివారం కేంద్ర ఎలక్ట్రానిక్స్‌, ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ మంత్రిత్వశాఖ అదనపు డైరెక్టర్‌ డాక్టర్‌ సంతోష్‌కుమార్‌ పాండ్యే సందర్శించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలో అధికారులు, పూజారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయ నిర్వాహకులు ఆలయ చరిత్రను ఆయనకు వివరించారు. తెలంగాణలో వ్యక్తిగత పర్యటనలో భాగంగా ఆయన నిత్యం నాలుగు పురాతన దేవాలయాలను సందర్శించి మొక్కులు చెల్లించుకోనున్నట్లు తెలిసింది.

వారి రూటే సెపరేటు!

ఎస్‌ఆర్‌ఓల్లో అక్రమార్కుల తిష్ట

- పాత స్టాంప్‌ పేపర్లు.. గుట్టుగా రిజిస్ట్రేషన్లు
- భూమి విలువ, విస్తీర్ణాన్ని బట్టి వసూళ్లు
- వివాదాస్పదమవుతున్న ఘటనలు
- ఫిర్యాదులు అందినా చర్యలు శూన్యం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అనధికార లే అవుట్లలో ఖాళీ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు.. వివాదాస్పద స్థలాలు.. నిషేధిత యూఎల్‌సీ.. అసైన్డ్‌ భూముల్లోని ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్లు.. నాలా కన్వర్షన్‌ చేయని భూముల రిజిస్ట్రేషన్లు కొంత మంది సబ్‌ రిజిస్ట్రార్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఎలాంటి లింకు డాక్యుమెంట్లు లేని ఖాళీ స్థలాలకు/ లే అవుట్లలో ప్రజా ప్రయోజనాల కోసం వదిలిన పార్కులకు పాతస్టాంప్‌ పేపర్లపై గుట్టుగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. కొంతమంది డాక్యుమెంట్‌ రైటర్లను ఏజెంట్లుగా నియమించుకుని ఒక్కో డాక్యుమెంట్‌పై భూమి విలువ, విస్తీర్ణాన్ని బట్టి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఏళ్ల తరబడి ఒకేచోట పని చేస్తుండటం, ఎప్పటికప్పుడు బదిలీలు చేయకపోవడం వీరికి కలిసి వస్తోంది. జిల్లాలో రోజుకు సగటున 650 నుంచి 700 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్‌ జరుగుతుంటాయి. వీటిలో అత్యధికంగా శేరిలింగంపల్లి, గండిపేట, ఎల్బీనగర్‌, చంపాపేట్‌, వనస్థలిపురం, హయత్‌నగర్‌, రాజేంద్రనగర్‌, శంషాబాద్‌, మహేశ్వరం, రాజేంద్రనగర్‌, చేవెళ్ల, శంకర్‌పల్లి, అబ్దుల్లాపూర్‌మెట్‌ ఎస్‌ఆర్‌ఓ (సబ్‌ రిజిస్ట్రేషన్‌ ఆఫీస్‌) సెంటర్లలో రిజిస్ట్రేషన్లు అవుతుంటాయి. ఆయా రిజిస్ట్రేషన్‌ ఆఫీసుల్లో ఏళ్లుగా అక్రమార్కులు తిష్టవేశారు. ఒక్కో డాక్యుమెంట్‌కు ఒక్కో రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారు.

ప్రైవేటు వ్యక్తులదే హవా

ఎస్‌ఆర్‌ఓల్లో ప్రభుత్వ ఉద్యోగుల కంటే ప్రైవేటు వ్యక్తుల హవానే ఎక్కువగా కొనసాగుతోంది. డాక్యుమెంటేషన్‌ మొదలు.. స్కానింగ్‌ వరకు ప్రతి పనిలో వారే కీలకంగా వ్యవహరిస్తున్నారు. కంప్యూటర్‌ ఎయిడెడ్‌ అడ్మినిస్ట్రేషన్‌ ఆఫ్‌ రిజిస్ట్రేషన్‌ డిపార్ట్‌మెంట్‌ (కార్డ్‌) అమల్లోకి వచ్చిన 1998 నుంచి అన్ని సబ్‌ రిజిస్ట్రేషన్‌ ఆఫీసుల్లో రిజిస్టర్డ్‌ డాక్యుమెంట్లు స్కానింగ్‌ చేస్తున్నారు. స్కానింగ్‌ కోసం యంత్రాలు కొనుగోలు చేసిన అధికారులు సిబ్బందిని నియమించలేదు. దీంతో ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు బయటి (జిరాక్స్‌ సెంటర్లు) వ్యక్తులపై ఆధారపడాల్సి వస్తోంది. రిజిస్ట్రేషన్‌ పూర్తయిన రెండు మూడు రోజుల్లోనే పత్రాలు సంబంధిత యజమానికి అందజేయాల్సి ఉంది. కానీ స్కానింగ్‌లో జాప్యంతో వారం పది రోజులు పడుతోంది. అంతేకాదు విలువైన ఆస్తి పత్రాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తుండడంతో ఒకే ప్లాటుకు రెండు మూడు డాక్యుమెంట్లు అవుతున్నట్లు తెలుస్తోంది. డాక్యుమెంట్లలో దొర్లిన తప్పులను సరి చేసే (ఎడిట్‌ ఇండెక్స్‌) అధికారం స్థానిక ఎస్‌ఆర్‌ఓలకు ఉండేది. ఇటీవల ఈ బాధ్యతను జిల్లా ఎస్‌ఆర్‌ఓకు అప్పగించారు. చేయి తడపనిదే ఎడిట్‌ ఇండెక్స్‌ ఫైళ్లు కదలడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

మచ్చుకు కొన్ని కేసులు

- జేడీ రోడ్డు సర్వే నంబర్‌ 58, సర్వే నంబర్‌ 60లో వెలసిన లే అవుట్లలో ప్రజావసరాల కోసం వదిలిన ఖాళీ స్థలాలకు ఎల్బీనగర్‌ ఎస్‌ఆర్‌ఓ రిజిస్ట్రేషన్లు చేయడం వివాదాస్పదంగా మారింది. నిజానికి ఏదైనా ప్లాటు రిజిస్ట్రేషన్‌ చేయాలంటే ఆ భూమికి సంబంధించిన పూర్వాపరాలు పరిశీలించాలి. లింక్‌ డాక్యుమెంట్లు సరి చూడాలి. ఇక్కడి ఎస్‌ఆర్‌ఓ ఇవేవీ పట్టించుకోకుండా రిజిస్ట్రేషన్‌ చేశారు. ప్రజా వసరాల కోసం వదిలిన ఖాళీ స్థలాన్ని పక్కప్లాటు వ్యక్తి ఆక్రమించుకుని గుట్టుగా రిజిస్ట్రేషన్‌ చేసుకున్న అంశంపై ఇటీవల ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించడం, సంబంధిత అధికారులపై న్యాయమూర్తి సీరియస్‌ కావడం చర్చనీయాంశంగా మారింది.
- వ్యవసాయ భూమిని వ్యవసాయేతర (నాలా కన్వర్షన్‌) భూమిగా మార్చేందుకు మార్కెట్‌ విలువ ప్రకారం 3 శాతం, ఏదైనా నిర్మాణాలు ఉంటే 4.5 శాతం చొప్పున రుసుం చెల్లించాలి. శేరిలింగంపల్లి మండలం నానక్‌రాంగూడ సర్వే నంబర్‌ 48లోని ఏడున్నర ఎకరాల భూమి రిజిస్ట్రేషన్‌ విషయంలో అక్రమాలకు పాల్పడ్డారు. ఈ భూమి విలువ రూ.166.40 కోట్లు ఉన్నట్లు అంచనా. ఈ లెక్కన ఏడున్నర ఎకరాలకు రూ.4.99 కోట్ల వరకు నాలా రుసుం చెల్లించాల్సి ఉంది. నాలా కన్వర్షన్‌ కాని ఈ భూమిని 37,061 గజాల చొప్పున మార్చి గుట్టుగా రిజిస్ట్రేషన్లు చేశారు. జిల్లా రిజిస్ట్రార్‌ దీన్ని గుర్తించి అబెయన్స్‌లో పెట్టడంతో విషయం వెలుగులోకి వచ్చింది. రిజిస్ట్రేషన్‌ చేసేప్పుడు లింకు డాక్యుమెంట్లతో పాటు నాలా, ప్రభుత్వ, ప్రైవేటు, వివాదాస్పద భూములు ఏమైనా ఉన్నాయా అనే అంశాన్ని ధ్రువీకరించుకున్న తర్వాతే రిజిస్ట్రేషన్లు చేయాలి. సబ్‌ రిజిస్ట్రార్‌ ఆఫీసు సిబ్బంది ఇవేవీ పట్టించుకోలేదు.
- ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి ఒక లే అవుట్‌లో కనీసం పది ప్లాట్లు రిజిస్టర్‌ అయితే అందులోని మిగిలిన ప్లాట్లను సైతం రిజిస్ట్రేషన్‌ చేసుకునేందుకు వెసులుబాటు కల్పించడాన్ని అవకాశంగా తీసుకుని అక్రమాలకు తెరలేపారు. రోజుకు 12 ప్లాట్లు కూడా రిజిస్ట్రేషన్‌ కాని, వికారాబాద్‌ జిల్లా తాండూరు సబ్‌ రిజిస్ట్రేషన్‌ కార్యాలయంలో కేవలం ఆరు రోజుల్లోనే 220 ప్లాట్లు రిజిస్ట్రేషన్‌ చేశారు. ఎల్‌ఆర్‌ఎస్‌ కటాఫ్‌ తేదీ (2020 ఆగస్టు 26) తర్వాత వెలసిన లే అవుట్లలోని ప్లాట్లు కూడా అంతకు ముందు తేదీలు వేసి, 25 శాతం రాయితీతో రిజిస్ట్రేషన్లు చేసి ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో గండి కొట్టారు. డాక్యుమెంట్లు స్కానింగ్‌ చేయకపోవడంతో అనుమానం వచ్చి ఆరా తీయగా అసలు విషయం బయటికి పొక్కింది.
- బాలాపూర్‌ మండలం అల్మాస్‌గూడ రెవెన్యూ సర్వే నంబర్‌ 129,130,131,132లో ప్రజావసరాల కోసం వదిలిన ఖాళీ ప్లాట్లకు చంపాపేట ఎస్‌ఆర్‌ఓ గుట్టుగా రిజిస్ట్రేషన్లు చేశారు. మున్సిపల్‌ టౌన్‌ప్లానింగ్‌ అధికారులు నిర్మాణాలకు అనుమతులు జారీ చేశారు. ఎలాంటి లింకు డాక్యుమెంట్లు లేని, కోర్టు వివాదంలో ఉన్న ఈ లే అవుట్‌లోని ఖాళీ స్థలాలను రిజిస్ట్రేషన్‌ చేయడం వివాదాస్పదంగా మారింది. ఎస్‌ఆర్‌ఓ, టౌన్‌ప్లానింగ్‌ అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినా ఇప్పటి వరకు ఏ ఒక్కరిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

విద్యార్థులకు స్ఫూర్తి

రాష్ట్రపతి భవన్‌లో ఆతిథ్యం.. స్వయానా రాష్ట్రపతితో అభినందనలు.. కేంద్ర మంత్రులతో ప్రశంసలు.. దిగ్గజ శాస్త్రవేత్తలతో సమాలోచనలు.. ఇలాంటి అరుదైన అవకాశం వస్తుందంటే ఎవరు మాత్రం కాదంటారు.. కానీ అందుకోసం విద్యార్థులు కాస్త కష్టపడాల్సి ఉంటుంది. తమ తెలివికి పదును పెట్టాలి.

- జాతీయ స్థాయిలో 'ఇన్‌స్పైర్‌ మనక్‌'
- స్టూడెంట్స్‌ ఆవిష్కరణలకు ఆహ్వానం
- ప్రతిభ చూపినవారికి నగదు పురస్కారాలు
- ఆన్‌లైన్‌ ద్వారా సెప్టెంబర్‌ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ

కేశంపేట: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను ప్రయోగాల వైపు నడిపించి, వారిలో వినూత్న ఆలోచనలకు పదును పెట్టి భావి భారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు 'ఇన్నోవేషన్‌ ఇన్‌ సైన్స్‌ పర్స్యూట్‌ ఫర్‌ ఇన్‌స్పైర్డ్‌ రీసెర్చ్‌' (ఇన్‌స్పైర్‌) పేరుతో ఇన్‌స్పైర్‌ మనక్‌ పురస్కారాలను అందిస్తోంది. ఆన్‌లైన్‌ ద్వారా 2025–26 విద్యా సంవత్సరానికి నామినేషన్లు స్వీకరిస్తోంది.

ఎవరు అర్హులంటే..

10 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి 6 నుంచి 10వ తరగతి చదివే ప్రతిభ కలిగిన విద్యార్థులకు అవకాశం. ప్రభుత్వ, ప్రైవేట్‌, గురుకుల, మోడల్‌ స్కూల్స్‌, కేజీబీవీ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు అర్హులు. వీరు పాఠశాలలోని సైన్స్‌ ఉపాధ్యాయుడి గైడ్‌లైన్స్‌ పాటిస్తూ ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేసుకునే విధానం

- ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి న్యూ రిజిస్ట్రేషన్‌ ఆప్షన్‌ ఎంచుకోవాలి.
- పాఠశాలకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకొని, సేవ్‌ చేసుకోవాలి. ఈ దరఖాస్తు జిల్లా అథారిటీకి వెళ్తుంది.
- వీరు ఆమోదిస్తే విద్యార్థికి సంబంధించి పొందుపర్చిన మెయిల్‌ ఐడీకి యూజర్‌ ఐడీతో కూడిన లింక్‌ వస్తుంది.
- అప్పుడు విద్యార్థులు యూజర్‌ ఐడీకి పాస్‌వర్డ్‌ను క్రియేట్‌ చేసుకోవాల్సి ఉంటుంది.
- విద్యార్థి తన సమాచారంతో పాటు బ్యాంక్‌ అకౌంట్‌ నంబర్‌, ఆధార్‌ నంబర్‌ నమోదు చేయాల్సి ఉంటుంది.
- విద్యార్థి ప్రదర్శించాలనుకున్న ప్రాజెక్టును సంక్షిప్తంగా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి.
- ఎంపికైన ప్రాజెక్టు ప్రయోగ నిమిత్తం విద్యార్థి బ్యాంక్‌ ఖాతాకు రూ.పదివేలు జమ చేస్తారు.
- రాష్ట్ర స్థాయికి ప్రాజెక్టు ఎంపికైతే రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు అందిస్తారు.
- ఆన్‌లైన్‌లో ఉచితంగా విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.

ఎప్పటిలోగా అంటే..

విద్యార్థులు తమ పేర్లను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్‌ 15 వరకు కేంద్ర ప్రభుత్వం గడువు విధించింది. విద్యార్థులు తాము చదువుతున్న పాఠశాలల్లో సైన్స్‌ ఉపాధ్యాయులతో కలిసి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.

గత విద్యా సంవత్సరం..

2024–25 విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయికి 1,881 నామినేషన్లు ఎంపికయ్యాయి. వీటి నుంచి ఉత్తమ ప్రతిభ కనబర్చిన 198 నామినేషన్లు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. వీటి నుంచి నాలుగు జాతీయ స్థాయికి వెళ్లాయి. ఈ విద్యా సంవత్సరం జాతీయ స్థాయిలో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటే విధంగా సైన్స్‌ ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులు తమలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇన్‌స్పైర్‌ ఎంతగానో దోహదపడుతుంది. ఉపాధ్యాయుల సహకారంతో పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలి. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా సైన్స్‌ ఉపాధ్యాయులు కృషి చేయాలి.

– వై.శ్రీనివాసరావు, జిల్లా సైన్స్‌ అధికారి



శిక్షణ తరగతులకు హాజరైన నాయకులు

సామాన్యులను విస్మరిస్తున్న కేంద్రం

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కోట రమేష్‌

కందుకూరు: నరేంద్రమోదీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెడుతోందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కోట రమేష్‌, జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య విమర్శించారు. మండల పరిధిలోని నేదునూరు గేట్‌ వద్ద ఉన్న ఓ ఫామ్‌ హౌస్‌లో ఆదివారం పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు డి.రాంచందర్‌, మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్‌ ఆధ్వర్యంలో కందుకూరు, మహేశ్వరం, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కోట రమేష్‌, పగడాల యాదయ్య మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ సామాన్య ప్రజలను విస్మరిస్తోందని పేర్కొన్నారు. రైల్వే, విమానయానం, ఎల్‌ఐసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం బాధాకరమన్నారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ సభ్యురాలు కవిత, ఆమనగల్లు, మహేశ్వరం పార్టీ కార్యదర్శులు శివశంకర్‌, ఏర్పుల శేఖర్‌, సీఐటీయూ నాయకులు గుమ్మడి కుర్మయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఎథ్నిక్‌ రన్‌'



కార్యక్రమంలో పాల్గొన్న గుమ్మడి వెన్నెల తదితరులు



సంప్రదాయ వస్త్రాలు ధరించి రన్‌లో పాల్గొన్న మహిళలు

శంకర్‌పల్లి: మండలంలోని పిల్లిగుండ్ల గ్రామంలో ఆదివారం గండిపేట వెల్ఫేర్‌ సొసైటీ ఆధ్వర్యంలో 'ఎథ్నిక్‌ రన్‌ –2025' కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ శారద నేరెళ్ల, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌ గుమ్మడి వెన్నెల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వందలాది మంది మహిళలు సంప్ర దాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శారద నేరెళ్ల మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యం, ప్లాస్టిక్‌ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించారు. గుమ్మడి వెన్నెల మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేస్తూ యువతలో ఆసక్తి పెంపొందించడంలో గండిపేట వెల్ఫేర్‌ సొసైటీ విజయవంతమైందని అభినందించారు. సొసైటీ జాయింట్‌ సెక్రెటరీ వాణి మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం తమ సొసైటీ ఏర్పడిందని, అప్పటి నుంచి మహిళల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్‌ నిర్మూలన అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఏడు ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు నడుపుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ మాజీ చైర్‌పర్సన్‌ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌ బియ్యం ప్లీజ్‌

- 30తో ముగియనున్న పంపిణీ గడువు
- స్టాక్‌ లేదని తిప్పి పంపుతున్న రేషన్‌ డీలర్లు
- లబ్ధిదారుల్లో కొనసాగుతున్న ఆందోళన
- వలస కుటుంబాల పరిస్థితి దయనీయం

సాక్షి, సిటీబ్యూరో: సన్నబియ్యం కోసం రేషన్‌ దుకాణాల చుట్టూ లబ్ధిదారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. డీలర్ల నుంచి స్టాక్‌ లేదనే సమాధానమే వస్తోంది. తుది గడువు సమీపిస్తుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో తెలంగాణ సర్కారు మూడు నెలలకు సంబంధించిన సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ నెల 1 నుంచి ఆహార భద్రత కార్డుల లబ్ధిదారులకు పంపిణీ ప్రారంభించారు. మేడ్చల్‌ -మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటికీ సన్నబియ్యం పొందని లబ్ధిదారులు 20 శాతం ఉన్నారు. ప్రభుత్వం మూడు నెలలకు సంబంధించి సన్న బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో.. పోర్టబిలిటీని దృష్టిలో పెట్టుకుని జీవనోపాధి కోసం వలస వచ్చిన కుటుంబాల కార్డుల సంఖ్యకు అనుగుణంగా బియ్యం సేకరణ చేపట్టాల్సిన అధికారులు సకాలంలో స్పందించక పోవడంతో రేషన్‌ దుకాణాల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి నెలకొంది.

మరో 11 వేల మెట్రిక్‌ టన్నులు వస్తేనే..

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 5,37,805 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. మూడు నెలల బియ్యం కోటాకు సంబంధించి 34,535 మెట్రిక్‌ టన్నుల బియ్యం అవసరమని జిల్లా పౌరసరఫరాల శాఖ లెక్కలేసింది. జిల్లాలో జీవనోపాధి కోసం వచ్చిన వలస కుటుంబాలకు సంబంధించి లక్షకు పైగా ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. వీరంతా ఇక్కడే రేషన్‌ బియ్యం తీసుకుంటున్నారు. పోర్టబిలిటీతో కలిపి జిల్లాకు 45,535 మెట్రిక్‌ టన్నుల బియ్యం అవసరం కాగా, 34,535 మెట్రిక్‌ టన్నులు మాత్రమే దిగుమతయ్యాయి. లబ్ధిదారులు రేషన్‌ దుకాణం వద్దకు వస్తే డీలర్ల నుంచి స్టాక్‌ లేదన్న సమాధానం వస్తుండటంతో నిత్యం తిరగాల్సి వస్తోంది. మరో 11 వేల మెట్రిక్‌ టన్నుల బియ్యం వస్తేనే లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో అందనున్నాయి.

రంగారెడ్డి జిల్లాలోనూ ఇదే పరిస్థితి

రంగారెడ్డి జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గ్రేటర్‌లోని మూడు జిల్లాల పరిధిలో జీవనోపాధి కోసం వచ్చిన వలస కుటుంబాలు అత్యధికంగా ఉండటంతో పాటు.. సన్నబియ్యం కూడా ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి తరలించాల్సి రావటంతో జాప్యం ఏర్పడింది. దీంతో లబ్ధిదారులు రేషన్‌ దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తోందని సంబంధిత అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కార్డుల సంఖ్యకు అనుగుణంగా రేషన్‌ దుకాణాలు లేకపోవటం కూడా మరో కారణం.



లబ్ధిదారులందరికీ అందజేస్తాం

ఆహార భద్రత కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తాం. పోర్టబిలిటీతో పాటు మూడు నెలలకు సన్నబియ్యం ఒకేసారి ఇస్తుండటంతో జాప్యం ఏర్పడుతోంది. దుకాణాలకు పంపిణీ చేయడంతో పాటు ఈ నెలాఖరు కల్లా లబ్ధిదారులందరికీ సన్నబియ్యం అందేలా చూస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్‌ఓ, మేడ్చల్‌– మల్కాజిగిరి జిల్లా

అసెంబ్లీ ఎదుట భారీ వాహనంలో మంటలు

నాంపల్లి: అసెంబ్లీ సమీపంలో ఓ భారీ వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఊహించని విధంగా వాహనంలో ఎగిసిపడటంతో అందరూ భయభ్రాంతులకు గురయ్యారు. మంటలు అంటుకున్న సమయంలో వాహనంలోని డ్రైవరుతో పాటు మరొకరు క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం అసెంబ్లీ ఉస్మానియా గేటు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. వాహనం రోడ్డుపైనే పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఫలితంగా కొంతసేపు నాంపల్లి నుంచి లక్డీకాపూల్‌ వెళ్లే దారిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.



మంటల్లో కాలిపోతున్న వాహనం

ఆదివారం ఆగని దందా

- సెలవు రోజుల్లోనూ పుస్తకాల విక్రయం
- నిబంధనలు పాటించని పాఠశాలలు
- చర్యలు తీసుకోవాలంటూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల డిమాండ్


ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో వాగ్వాదానికి దిగిన పాఠశాల సిబ్బంది

షాద్‌నగర్‌రూరల్‌: ప్రైవేట్‌ పాఠశాలల్లో సెలవురోజున పుస్తకాల దందా కొనసాగుతోందని, నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌ డిమాండ్‌ చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేట్‌ పాఠశాలలో ఆదివారం బుక్స్‌ విక్రయిస్తుండగా.. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇదేమిటని ప్రశ్నించిన తమపై అక్కడి సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్‌చేసి రాత పుస్తకాలు తీసుకుంటేనే పాఠ్యపుస్తకాలు ఇస్తామని మెలిక పెడుతూ.. ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. అధిక ధరలకు నోట్స్‌ను అంటకడుతూ డబ్బులు దండుకుంటున్నారని తెలిపారు. పాఠశాలల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా.. విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇదే విషయమై గతంలో మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. బుక్స్‌, యూనిఫాంలు అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆదిల్‌, రఘు, నవీన్‌, కిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్‌టీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య


పోచయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మొయినాబాద్‌రూరల్‌: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్‌టీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు యు.పోచయ్య అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో స్కూల్‌ టీచర్‌ సమైక్య(ఎస్‌టీఎఫ్‌) తెలంగాణ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచయ్యకు ఓడీ సౌకర్యం లభించడంతో ఆయనను ఆ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. దాంతో పాటే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి పి.గోపాల్‌, ప్రతినిధులు విఠల్‌, రమేష్‌, రాంచంద్రయ్య, రాంచందర్‌, నర్సింహులు, లక్ష్మినారాయణ, దిలీప్‌, భగవత్‌గీత, రాజారావు, మొయినాబాద్‌ మండల అధ్యక్షుడు పి.సుధాకర్‌, వెంకటస్వామి, రజిత, సంతోష్‌, ప్రకాష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి అనుమానాస్పద మృతి


వెంకటేశ్వరరావు

మీర్‌పేట: అనుమానాస్పద స్థితిలో ఓ ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. కాలనీవాసులు, ఇన్‌స్పెక్టర్‌ నాగరాజు కథనం ప్రకారం.. ఏపీ కృష్ణా జిల్లా పెద్దమద్దాలి గ్రామానికి చెందిన బండి వెంకటేశ్వరరావు(59) పదేళ్లుగా బడంగ్‌పేట సాయిప్రభు హోమ్స్‌ కాలనీలో భార్య జయంతి, కుమారుడు రాజ్‌భరత్‌, కోడలు గౌతమితో కలిసి ఉంటున్నాడు. ఆయన ఆబిడ్స్‌లోని పేఅండ్‌ అకౌంట్స్‌ కార్యాలయంలో ఆడిటర్‌గా విధులు నిర్వహించేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం వెంకటేశ్వరరావు నీటి సంపులో శవమై తేలాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఉస్మానియాకు తరలించారు.

మృతిపై సందేహాలు

కొంత కాలంగా తనను భార్య, కుమారుడు, కోడలు వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మృతుడు వెంకటేశ్వరరావు తరచూ తమతో చెప్పేవాడని కాలనీవాసులు పేర్కొన్నారు. తండ్రి చనిపోతే కుమారుడికి ఉద్యోగం వస్తుందని, అందుకే మానసికంగా వేధిస్తున్నారని తెలిపినట్లు చెప్పారు. ఇక్కడే ఉంటే తనను చంపేలా ఉన్నారని, వారం రోజుల్లో మలక్‌పేటలోని ప్రభుత్వ క్వార్టర్‌కు మారుతానని శనివారం రాత్రి చెప్పినట్లు స్థానికులు వెల్లడించారు. ఆయన మృతిపై అనుమానం ఉందని, మృతుడి కుమార్తె ధరణిదేవి మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి


టిల్లు(ఫైల్‌)

ఆమనగల్లు: లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం పట్టణంలోని హైదరాబాద్‌–శ్రీశైలం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్‌ఐ సీతారాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లు మున్సిపాలిటీ ముర్మజపల్లి గ్రామానికి చెందిన మహేందర్‌నాథ్‌ అలియాస్‌ టిల్లు(23) బైక్‌పై వెళ్తున్న క్రమంలో కల్వకుర్తి నుంచి మధ్యప్రదేశ్‌కు పత్తిలోడ్‌తో వెళ్తున్న లారీ కాటన్‌మిల్లు సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఇదే సమయంలో కల్వకుర్తి నుంచి నగరానికి వెళ్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించాడు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆర్థిక సహాయం అందజేశారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెట్టును ఢీకొన్న బైక్‌, ఒకరి మృతి

యాచారం: బైక్‌ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నగర శివారులోని జిల్లెలగూడకు చెందిన శ్రీనాథ్‌(18), స్నేహితులు మణిదీప్‌, చరణ్‌లతో కలిసి శనివారం నల్గొండ జిల్లా దేవరకొండ సమీపంలోని వైజాక్‌ కాలనీకి వెళ్లారు. ఆలస్యం కావడంతో రాత్రి చింతపల్లి మండలం వింజమూర్‌లోని బంధువుల ఇంట్లో నిద్రించారు. ఆదివారం తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు శ్రీనాథ్‌.. మిత్రులతో కలిసి బైక్‌పై నగరానికి బయలుదేరాడు. మార్గ మధ్యలో సాగర్‌రోడ్డుపై చౌదర్‌పల్లి గేట్‌ వద్ద బైక్‌ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనాథ్‌ దుర్మరణం చెందగా.. మణిదీప్‌, చరణ్‌లు గాయపడ్డారు. కేసు దర్యాప్తులో ఉంది.

అగ్ని ప్రమాదం

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని శాస్త్రీపురం కాలనీలోని ప్లాస్టిక్‌ చైర్‌ పరిశ్రమంలో ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మంటలను గమనించిన స్థానికులు అగ్నిపమాక, పోలీసులకు సమాచారం అందించారు. రాజేంద్రనగర్‌, చందులాల్‌ బారాదారి అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదం జరిగినప్పుడు పరిశ్రమలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది.

నిధులు లేక కటకట

- పంచాయతీ నిర్వహణకు అప్పులభారం
- ట్రాక్టర్‌ డీజిల్‌కు సైతం ఇబ్బంది
- సొంత నిధులు వెచ్చించలేమని కార్యదర్శుల ఆవేదన
- గ్రామాల్లో అటకెక్కిన పరిపాలన


పనులు చేయలేమని ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు (ఫైల్‌)

పరిగి: గ్రామాల్లో ప్రత్యేక పాలన వెక్కిరిస్తోంది. నిధులు లేకపోవడంతో పనులు సాగడం లేదు. దీంతో పాలన కార్యదర్శులకు రోజురోజుకూ భారంగా మారుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు నెలల తరబడి విడుదల కాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు అప్పుల పాలవుతున్నారు. చిన్న పంచాయతీల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇటీవల పరిగి, దోమ మండలాల్లోని అన్ని గ్రామాల కార్యదర్శులు సమస్యల పరిష్కారానికి డబ్బులు లేవని ఎంపీఓ, ఎంపీడీఓలకు వినతిపత్రం అందజేసి పంచాయతీ ట్రాక్టర్ల తాళాలను అందజేశారు. అదే బాటలో మిగతా కార్యదర్శులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిన్న జీపీలు కుదేలు

జిల్లాలో 20 మండలాలు ఉండగా 566 గ్రామ పంచాయతీలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కాక పోవడంతో విద్యుత్‌ బిల్లులు, కార్మికుల వేతనాలు, వీధి దీపాల బిల్లులు, ట్రాక్టర్‌ నిర్వహణ, బోరు మోటార్ల మరమ్మతులు తదితర వాటికి కాసులు లేక అరిగోసలు పడుతున్నారు. పెద్ద పంచాయతీలకు వస్తున్న కొద్దిపాటి ఆదాయంతో అభివృద్ధి పనులు ఓ మోస్తరుగా సాగుతున్నాయి. కానీ చిన్న పంచాయతీల్లో మాత్రం ఎలాంటి పనులు జరగడం లేదు. రోజు రోజుకూ పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి దీనంగా మారుతుందని, అప్పుల కుప్పలుగా మారుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. తాము గ్రామాల్లో సొంత ఖర్చులతో పనులు చేయలేమని కార్యదర్శులు ఉన్నతాధికారులకు తేల్చి చెప్పారు.

కొరవడిన ప్రభుత్వ సహకారం

కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు విడుదల కావడం లేదు. గత 20 నెలలుగా గ్రామాలకు ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. ఇక రాష్ట్రం నుంచి రావాల్సిన నిధులైతే 2022 నుంచి నిలుపుదల చేశారు. స్థానిక సంస్థల్లో పాలకవర్గం లేకపోవడంతో గ్రామ పంచాయతీలకు కేంద్రం నిధులు విడుదల చేయడం లేదు. కొంత కాలంగా పల్లెల్లో సమస్యలను పంచాయతీ కార్యదర్శులే నిర్వహిస్తున్నారు. ఇలా చాలా మంది కార్యదర్శులు అప్పులు చేసి పనులు చేపట్టారు. అయినా ప్రభుత్వం నుంచి సహకారం రాకపోవడంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు చేశాం



గ్రామంలో నిత్యం ఎక్కడో ఒక చోట సమస్యలుంటాయి. తొలుత ప్రత్యేక పాలనలో ఇబ్బందులు రాకున్నా దినదినం భారంగా మారుతుంది. వచ్చే జీతం డబ్బులు కూడా గ్రామ సమస్యల కోసం ఖర్చు చేస్తున్నాం. అవి సరిపోకపోవడంతో అప్పులు చేశాం. ఊరిలో సమస్యలు పరిష్కరించాలంటే ఇక సొంత డబ్బులు ఖర్చు చేయలేము.
– వేమారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, రాఘవపూర్‌

‘టెక్స్‌టైల్‌’ భూముల విక్రయానికి యత్నం!


టెక్స్‌టైల్‌ పార్కు ఎదుట ఆందోళన చేస్తున్న సొసైటీ సభ్యులు, రైతులు

నిరసన వ్యక్తంచేసిన సొసైటీ సభ్యులు

నందిగామ: టెక్స్‌టైల్‌ పార్కు ఏర్పాటు చేసి, స్థానికులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కొనుగోలు చేసిన భూమిని విక్రయించేందుకు కొందరు డైరెక్టర్లు యత్నిస్తున్నారని సొసైటీ సభ్యులు ఆరోపించారు. కొందరు రైతులతో కలిసి ఆదివారం హైదరాబాద్‌ హైటెక్‌ టెక్స్‌టైల్‌ పార్క్‌ వద్ద ఆదివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 2002, 2003 సంవత్సరంలో టెక్స్‌టైల్‌ పార్క్‌ కోసం చేగూరు రెవెన్యూ పరిధి నర్సప్పగూడ గ్రామ శివారులో 142 ఎకరాల భూమిని కొనుగోలు చేశామని తెలిపారు. ఆ సమయంలో 108 మంది సభ్యులు, 8 మంది డైరెక్టర్లతో ఒక సొసైటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆ భూమిలో ప్రభుత్వ రాయితీతో పరిశ్రమలు ఏర్పాటు చేసి, స్థానికులకు, భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చామని వివరించారు. కానీ అనుకున్న ఆశయం నెరవేరకుండా కొందరు డైరెక్టర్లు ఎవరికీ తెలియకుండా ఆ భూములను అమ్మకానికి పెట్టారని ఆరోపించారు. తామంతా కష్టపడి సంపాదించిన డబ్బులతో భూములు కొనుగోలు చేశామని, మా భూములు మాకు కేటాయిస్తే పరిశ్రమలు స్థాపించి, పలువురికి ఉపాధి చూపుతామని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి, జాగల విక్రయానికి యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకుని, ఆ భూములను తమకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో బోర్డు సభ్యులు పురుషోత్తం, గడ్డం దేవదాస్‌, వెంకటరమణ, శ్రీరాములు, సురేంద్ర, రవి, రమేష్‌, బలరాం తదితరులు పాల్గొన్నారు.

కూలీ ఆత్మహత్య!

ఇబ్రహీంపట్నం రూరల్‌: అనుమానాస్పద స్థితిలో ఒడిశా మహిళా కూలి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ బాల్‌రాజ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ ఎంపీపటేల్‌గూడలో మనోజ్‌బ్రిక్స్‌ కంపెనీలో లలిత పహారియా, మున్సింగ్‌ పహారియా దంపతులు కొంత కాలంగా పని చేస్తున్నారు. శనివారం రాత్రి ఇద్దరి మధ్య స్వల్ప వాగ్వివాదం చోటు చేసుకుంది. తెల్లవారుజామున భర్త లేచి చూడగా.. భార్య లలిత కనిపించలేదు. చుట్టు పక్కల వెతకగా.. ఓ చెట్టుకు లలిత(23) మృతదేహం వేలాడుతుండటాన్ని గమనించాడు. వెంటనే విషయాన్ని యజమానికి తెలిపి, మృతదేహంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా.. ఇటుక బట్టీల యజమాని పర్యవేక్షణ లోపంతోనే ఇదంతా జరిగిందని, ఇంకేమైనా కారణాలు ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. రాత్రికి రాత్రే మృతదేహాన్ని ఒడి శాకు తరలించినట్లు తెలుస్తోంది. మృతిపై స మగ్ర విచారణ జరిపించాలని కోరుతున్నారు.

చెరువులో మునిగి ఇద్దరు మృతి


ప్రణీత, ఇంద్రసేనారెడ్డి మృతదేహాలు

అబ్దుల్లాపూర్‌ మెట్‌: చెరువు పక్కన ఉన్న బండరాయిపై ఆడుకుంటున్న ఓ చిన్నారి ప్రమాదవశాత్తు చెరువులో పడింది. ఆమెను రక్షించడానికి ప్రయత్నించిన మరో యువకుడు కూడా చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌ మెట్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ గుంటూరు జిల్లాకు చెందిన చిన్నపురెడ్డి ప్రతాప్‌ రెడ్డి, భార్య ఇద్దరు పిల్లలతో కలిసి అబ్దుల్లాపూర్‌ మెట్‌లోని లక్ష్మీ ప్రియానగర్‌ కాలనీలో నివాసం ఉంటున్నారు. అనాజ్‌పూర్‌ సమీపంలోని ఇందిరమ్మ చెరువు దగ్గర వెంచర్లో ప్రతాప్‌రెడ్డి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కూతురు ప్రణీత(10)తో పాటు బంధువులతో కలిసి వెంచర్‌ దగ్గరికి వెళ్లాడు. వెంచర్‌ సమీపంలో ఉన్న చెరువు వద్ద బండరాయిపై ఆడుకుంటున్న ప్రణీత.. ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగిపోయింది. గమనించిన ప్రతాప్‌రెడ్డి బంధువు చింతంరెడ్డి ఇంద్రసేనారెడ్డి(20) ఆమెను కాపాడే ప్రయత్నంలో అతను కూడా మునిగి ఇద్దరూ చనిపోయారు. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నిమ్స్‌కు తరలించారు.

వేడుకగా వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

రాజేంద్రనగర్‌: బుద్వేల్‌లోని వీరభద్రస్వామి భద్రకాళి ఆలయ మూడవ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా దేవాలయాన్ని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. ఉదయం అభిషేకం, అలంకరణ అనంతరం భక్తులకు వీరభద్ర స్వామి భద్రకాళి అమ్మవారి దర్శనాన్ని ప్రారంభించారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా తగు ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి


నూతన సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న కృష్ణ

బీసీసేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ

షాబాద్‌: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ డిమాండ్‌ చేశారు. ఆదివారం షాబాద్‌ మండల పరిధి చందనవెళ్లి గ్రామంలో బీసీసేన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా చాకలి శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా గడీల మహిపాల్‌, ప్రధాన కార్యదర్శిగా మల్లేశ్‌, యువజన కమిటీ అధ్యక్షుడిగా చిప్పలపల్లి శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా శివలను నియమించారు. అనంతరం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో అభివృద్ధి సాధించాలంటే గ్రామస్థాయి నుంచే ఐక్యమత్యం కావాలన్నారు. అందుకే ఆర్‌.కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీలను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీసేన మండల అధ్యక్షుడు కమ్మరి దయాకర్‌చారి, జిల్లా నాయకులు వెంకటేశ్‌, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి చంద్రశేఖర్‌, నందిగామ మండల ఉపాధ్యక్షుడు నర్సింహులు, షాబాద్‌ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌, గ్రామ పెద్దలు చేవెళ్ల స్వామి, మాజీ సర్పంచ్‌లు లింగం, శ్రీనివాస్‌గౌడ్‌, నాయకులు రాఘవచారి, మల్లేశ్‌, వెంకటేశ్‌, వడ్ల మల్లేశ్‌, తదితరులు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్‌

మరో ఇద్దరి పరారు

నాంపల్లి: గంజాయి విక్రయిస్తున్న ఓ ఇంటిపై ఎస్‌టీఎఫ్‌ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో ఒకరిని అరెస్టు చేయగా మరో ఇద్దరు పరారయ్యారు. అరెస్టు చేసిన వారి నుంచి 1.138 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్‌ చేశారు. ఈ ఘటన నాంపల్లి ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని మాన్గార్‌ బస్తీలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మాన్గార్‌ బస్తీలో గంజాయి విక్రయిస్తున్నట్లుగా సమాచారం రావడంతో దాడులు చేసినట్లు ఎస్‌టీఎఫ్‌ టీమ్‌ లీడర్‌ నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. ఈ కేసులో కాంబ్లే అరుణ్‌ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు వివరించారు. సాకేత్‌ రాజు, ఖలీద్‌ అనే మరో ఇద్దరు పరారైనట్లు తెలిపారు. నిందితుడిని నాంపల్లి ఎక్సైజ్‌ పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

డ్రైనేజీ నిర్మాణం.. అస్తవ్యస్తం..!

- పనుల్లో నాణ్యతాలోపం
- రెండు రోజులకే గుంతలుగా మారిన వైనం
- ప్రమాదాల బారిన వాహనదారులు
- అధికారుల తీరుపై ప్రజాగ్రహం


శంషాబాద్‌ ప్రధాన రహదారిలో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ పనులు

శంషాబాద్‌: శంషాబాద్‌ పట్టణ ప్రధాన రహదారిలో చేపట్టిన డ్రైనేజీ పనులు.. మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పట్టణంలోని పాత పోలీస్‌ స్టేషన్‌ వెళ్లే రహదారిలో రైల్వే కమాన్‌ వద్ద ప్రధాన మార్గంలో డ్రైనేజీ లైను కలిపేందుకు రెండు రోజుల క్రితం పనులు చేపట్టారు. పైపులు వేసిన తర్వాత దానిని రహదారికి సమాంతరంగా కాకుండా చాలా ఎత్తులో సిమెంట్‌ పనులు చేశారు. దీంతో పైపులపై వేసిన సిమెంట్‌ వల్ల అది కాస్తా ఎత్తైన స్పీడు బ్రేకర్‌లా తయారైంది.

- ఇది ఒక ఎత్తైతే నాణ్యత లేకుండా నిర్మించినందున గడచిన దానిపై రంధ్రాలు ఏర్పడ్డాయి. ఈ కారణంగా రెండు రోజుల్లోనే అదికాస్తా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను కల్గిస్తోంది. కింద ఉన్న డ్రైనేజీ బయటపడేలా కనిపిస్తోంది. ఈ ప్రాంతంలో వేగంగా వచ్చే వాహనాలు ఎత్తుగా ఉండటంతో ఒక్కసారిగా బ్రేక్‌ వేయాల్సి వస్తుండటంతో తరచూ ప్రమాదాలూ చోటుచేసుకుంటున్నాయి.
- ఇకనైనా మున్సిపల్‌ అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి నాణ్యత లేమితో చేపట్టిన పనులను వెంటనే సరిద్దాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్‌ చేస్తున్నారు.
- ఈ ప్రాంతంలోనే ఆరు నెలల క్రితం బస్టాప్‌ ఏర్పాటు చేశారు. అప్పట్లో మిగిలిన మట్టి, రా తిపౌడర్‌ ఇతర వ్యర్థాలను అక్కడే వదిలేశారు. అ వి పూర్తిగా గట్టిపడిపోయాయి. కొంతకాలంగా రహ దారికి అడ్డుగా ఉన్నందున రాకపోకలు సా గించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా రు. అ యినా మున్సిపల్‌ అధికారులు మాత్రం దా నిని తొలగించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

సరిదిద్దుతాం

ఔట్‌ లెట్‌కు సమాంతరంగా ఉన్న కారణంగా రోడ్డుకన్నా ఎక్కువ ఎత్తులో డ్రైనేజీని నిర్మించాల్సి వచ్చింది. వ్యర్థాలను వెంటనే తొలగించి.. మిగిలిన పనులను పూర్తిచేసి రోడ్డును సరిదిద్దుతాం. వాహనదారులు, పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.
– నరేష్‌, ఏఈ శంషాబాద్‌ మున్సిపాలిటీ